సాక్షి తిరుపతి


ఆదివారం । 15 । సెప్టెంబర్ । 2024



1,562 కేసుల పరిష్కారం

తిరుపతి కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. 1,562 కేసులు పరిష్కరించారు.

- 8లో



తిరుమలలో 'కూటమి' తట్టలు!

తిరుమలలో కూటమి నేతలు నయా దందాకు శ్రీకారం చుట్టారు. అనధికార హాకర్ల అవతారం ఎత్తారు.

- 8లో



వైద్యులకు సేవానిరతి తప్పనిసరి

తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరయ్యారు.

- 8లో

న్యూస్‌రీల్

గజ వాహనంపై సిరులతల్లి



ఊరేగుతున్న అమ్మవారు

తిరుపతి రూరల్ : శ్రీపద్మావతి అమ్మవారి జన్మ నక్షత్రం ఉత్తరాషాఢను పురస్కరించుకుని శనివారం రాత్రి సిరులతల్లికి వైభవంగా గజవాహన సేవ నిర్వహించారు. అంతకు ముందు అమ్మవారిని ఆస్థాన మండపానికి వేంచేపు చేసి కనులపండువగా అలంకరించారు. అనంతరం గజ వాహనంపై కొలువుదీర్చి వేడుకగా మాడ వీధుల్లో ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు శ్రీపద్మావతీదేవిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా పవిత్రోత్సవాలు



హారతి సమర్పిస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో రెండో రోజు శనివారం పవిత్రోత్సవాలను వైభవంగా నిర్వహించారు. నిత్య పూజల్లో తెలిసో తెలియకో జరిగే దోషాల పరిహార్థం ఈ ఉత్సవాలను జరిపించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆలయంలోని యాగశాలలో శ్రీ–కాళ–హస్తి, భరద్వాజ మహర్షికి విశేష అభిషేకాలు చేశారు. అనంతరం ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



భాకరాపేట ఘాట్ రోడ్డు పరిశీలనలో అధికారులు

భాకరాపేట : తిరుపతి–బళ్లారి జాతీయ రహదారిలో ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. శనివారం ఈ మేరకు చిన్నగొట్టిగల్లు, చంద్రగిరి మండలాల పరిధిలోని 9 కిలోమీటర్ల భాకరాపేట ఘాట్ రోడ్డును ఆయన పరిశీలించారు. ఘాట్‌లో ప్రమాదాల నివారణకు పోలీస్, జాతీయ రహదారుల శాఖ, ఆర్టీసీతో కలసి భాకరాపేట ఘాట్‌లో చెక్ పోస్టు ఏర్పాటు చేయడం, వాహన దారులకు సూచనలు, తనిఖీలు చేపట్టడడం, సూచిక బోర్డులు, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయడంపై చర్చించారు. భాకరాపేట, రంగంపేట వద్దనే వాహనాలు తనిఖీలు చేయడం, డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులను చెక్ చేసి పంపించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. ప్రమాదకర మలుపుల వద్ద పని చేయని ట్రాఫిక్ సిగ్నల్స్, ఒరిగి పోయిన, విరిగి పోయిన సూచక బోర్డులను మార్చాలని స్పష్టం చేశారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 13 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 60,694 మంది స్వామిని దర్శించుకున్నారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 12 గంటలు పడుతోంది.

పేద విద్యార్థుల కడుపు కొడితే సహించం



మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసి పేద విద్యార్థుల కడుపు కొడితే సహించం. విద్యార్థి సంఘాలతో కలసి పోరాటం చేస్తాం. ఇప్పటికే కేంద్రప్రభుత్వ వైఖరి కారణంగా నీట్ రాసిన విద్యార్థులు నష్టపోయారు. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరైన మెడికల్ కళాశాలలను కార్పొరేట్ వ్యక్తుల చేతులతో పెడుతోంది. పేదలకు వైద్య విద్యను దూరం చేసే ప్రక్రియను తక్షణం విరమించుకోవాలి. ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రోత్సహించి సీట్లు పెంచి పేదలకు మెడిసిన్ విద్యను అందేలా చర్యలు తీసుకోవాలి. ఈ దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించాలి.

- బండి చలపతి, ఏఐఎస్ఎఫ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తిరుపతి



పేదలకు అండగా ఉండాలి



చంద్రబాబు సర్కార్ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేస్తారనే వార్తలు వింటుంటే మా లాంటి పేద కుటుంబాల పిల్లలు తీవ్రంగా మనస్తాపం చెందుతున్నారు. తక్షణం అలాంటి ఆలోచన వెనక్కి తీసుకోవాలి. ఈ ఏడాది నీట్‌లో మా అబ్బాయికి 570 మార్కులు వచ్చినా సీటు రాలేదు. దీంతో మళ్లీ లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇప్పిస్తున్నాం. ప్రైవేటు మెడికల్ కళాశాలలో సీటు వచ్చినా రూ.లక్షలు కట్టాలి. అంత స్తోమత మాకు లేదు. ప్రభుత్వ కళాశాలు పెరిగాయని సంతోష పడ్డాం. కానీ ప్రస్తుత పరిస్థితిని చూస్తే భయమేస్తోంది. పేదలకు ప్రభుత్వం అండగా నిలబడాలి.

- ప్రమీల, విద్యార్థి తల్లి, తిరుపతి

సాహసమే శ్వాసగా..!



దట్టమైన శేషాచల అడవిలో ట్రెక్కింగ్ చేస్తున్న యువత

ప్రకృతి ఒడిలో సేదతీరుతూ.. ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదిస్తూ.. ఎత్తయిన కొండలను అధిరోహిస్తూ.. దట్టమైన అటవీప్రాంతాలను అధిగమిస్తూ.. విశేష తీర్థాల్లో పుణ్య స్నానమాచరిస్తూ.. ప్రమాదకర లోయలను పలకరిస్తూ.. పురాతన కట్టడాలను పరిశీలిస్తూ.. ప్రాచీన సంస్కృతి ఆనవాళ్లను గుర్తిస్తూ.. వారసత్వపు అవశేషాలను గమనిస్తూ.. కాంక్రీట్ జంగిల్‌కు దూరంగా.. యాంత్రిక జీవనం నుంచి ఆటవిడుపుగా.. సాహసమే శ్వాసగా సాగిపో అనుకుంటూ పర్యావరణ ప్రేమికులు ముందడుగు వేస్తున్నారు. శేషాచలంతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ట్రెక్కింగ్ చేస్తున్నారు. సంభ్రమాశ్చర్యాలకు గురిచేసే అద్భుత దృశ్యాలను ఆధునిక సమాజానికి పరిచయం చేస్తున్నారు.

- ట్రెక్కింగ్‌పై ఆసక్తి చూపుతున్న పర్యావరణ ప్రేమికులు
- కొండలు.. కోనలను అవలీలగా అధిగమిస్తూ యాత్రలు
- ప్రకృతి అందాలను ఆనందంగా ఆస్వాదిస్తున్న ట్రెక్కర్లు


తిరుపతి కల్చరల్ : ఉరుకులు, పరుగులతో కూడిన ఆధునిక జీవన శైలికి నేటి సమాజం అలవాటు పడిపోయింది. మానవీయ విలువలు కనుమరుగై, ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలకు దూరమైంది. ఆహ్లాదం, ఆరోగ్యం పంచే ప్రకృతి ప్రసాదించిన సహజ వనరులకు ముప్పు వాటిల్లుతున్నా.. పట్టించుకోని దుస్థితికి చేరిపోయింది. మన చారిత్రక విశేషాలను, కనువిందైన ప్రాంతాలను నేటి తరానికి పరిచయం చేస్తున్న పర్యావరణ ప్రేమికులను అభినందించాల్సిందే. వారు చేపడుతున్న ట్రెక్కింగ్‌ను ప్రశంసించాల్సిందే. అడవులు, కొండలు, కోనలు, నదీతీరాల్లో కాలి నడకన సాగించే సాహస యాత్రనే ట్రెక్కింగ్ అని పిలుస్తారు. ఈ ట్రెక్కింగ్ అనేది యూరోపియన్ పదం. అయితే తెలుగులో ఈ యాత్రను గవేషణ అని చెప్పవచ్చు. ప్రకృతిని ఆస్వాదిస్తూ జనావళికి దూరంగా అడవుల్లో ఆవిష్కృతమైన చారిత్రక కట్టడాలు, ఆలయాలు, ప్రాచీన మానవుల సంప్రదాయాలను, వనరులను, పురాతన సంస్కృతి చిహ్నాలను అన్వేషించి చిత్రాల రూపంలో ప్రజలకు తెలియజేస్తున్నారు.

ప్రకృతి అందాల ఆవిష్కరణ

పలువురు ట్రెక్కర్స్ ప్రకృతి సౌందర్యాన్ని ప్రజలకు చేరువ చేశారు. అందులో భాగంగా చంద్రగిరి మ్యూజియం, ఎస్వీ జూ పార్క్, అలిపిరి– తిరుమల దారిలో శేషాచల జీవవైవిధ్య వాటిక మ్యూజియం, జంగిల్ బుక్ ఏర్పాటుకు విశేషంగా కృషి చేశారు.

తిరునగరి కేంద్రంగా 40 ఏళ్ల క్రితమే..!

ఆధ్యాత్మిక తిరుపతి నగరంలో నాలుగు దశాబ్దాల క్రితం ఆరంభమైన సాహస యాత్ర..ఈ ట్రెక్కింగ్. తిరుపతికి చెందిన గోగుల విజయకుమార్ అనే న్యాయవాది పాప్ ట్రెక్కింగ్ సంస్థను ఏర్పాటు చేసి ఈ యాత్రలకు నాంది పలికారు. తర్వాత పర్యావరణంపై మక్కువతో బీవీ రమణ, ట్రెక్కింగ్ బాలు మరింతగా ఈ సాహస యాత్రలను ముందుకు తీసుకువెళ్లారు. మిత్రబృందంతో కలిసి ట్రెక్కింగ్ చేపట్టారు. సుమారు 30 ఏళ్లుగా తిరుపతి వాసులేకాక, జిల్లాయేతర పర్యావరణ ప్రేమికులతో కలిసి అనేక పర్యాయాలు సాహస యాత్రలు సాగించారు. తిరుమల, శేషాచలం, చంద్రగిరితో పాటు జిల్లాలోని చారిత్రక ప్రాంతాలే కాకుండా జాతీయ స్థాయిలో మరెన్నో చోట్ల ట్రెక్కింగ్ సాగించారు. అద్భుతమైన చారిత్రక కట్టడాలు, ఆదిమానవుల అవశేషాలు, పురాతన సంస్కృతిని ఆవిష్కరించే చిహ్నాలను సమాజానికి పరిచయం చేశారు. మొజాయిక్ అడ్వెంచర్ కమ్యూన్ (మ్యాక్) సంస్థను స్థాపించి సామూహిక ట్రెక్కింగ్ చేపట్టారు. ఇప్పటికీ వందలాది మందితో వీరు ట్రెక్కింగ్ కొనసాగిస్తున్నారు.



శేషాచలం అడవిలో ట్రెక్కింగ్ నిర్వాహకులు రమణ, బాలు





కొండలు.. గుట్టలు.. బండలు దాటుతూ ట్రెక్కింగ్ చేస్తున్న యువతీయువకులు

కనిపెట్టిన ప్రదేశాలు ఇవే..

శేషాలంలో అద్భుతమైన జలపాతాలు, తీర్థాలు, చిత్రమైన పక్షులు, జంతువులును ట్రెక్కర్లు పరిచయం చేశారు. అంతేకాక మల్లయ్యపల్లె పాండవ గుడి, చంద్రగిరిలో విలక్షణ వాస్తు తాటికోన, భైరవకోన, రెండు కొండల మధ్య శిథిల గోపురం, హనుమాన్ చిహ్నంతో కూడిన కనుమదారి, ఆదిమానవుడి అవశేషాలు, అద్భుత శిలా సమూహం, బంగారు బల్లి, అడవి ఏనుగులు, చారిత్రక చిహ్నాలు వంటి ఎన్నో అద్భుతాలను చిత్రాల రూపంలో, పుస్తకాల రూపంలో సమాజానికి అందించారు. ట్రెక్కింగ్‌లో దర్శించిన అద్భుతాలు, ప్రకృతి సౌంధర్యాలు, పురాతన, చారిత్రక కట్టడాలు, తీర్థాలు వంటి వాటి చిత్రాల ప్రదర్శనలతో జనంలో ప్రకృతిపై మక్కువను పెంచే కార్యక్రమాలు చేపట్టారు.





సుందర జలపాతం వద్ద ఈ గుడారమే బస

యువతకు ఆసక్తి కలిగించడమే..



యువతలో ప్రకృతి పట్ల ఆసక్తికి కలిగించి విశిష్టతను తెలియజేసి తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలనే తాపత్రయంతోనే ట్రెక్కింగ్ చేపడుతున్నా. నాకు 16 ఏళ్లు ఉన్నప్పుడు తొలిసారి ట్రెక్కింగ్ చేశా. గత 39 ఏళ్లుగా ఈ యాత్రలను కొనసాగిస్తున్నా. ట్రెక్కింగ్ కష్టతరమైనా ఈ యాత్రలో సందర్శించే ప్రకృతి అందాలు, అద్భుతాలలే సులభతరంగా మారుస్తాయి. ఇప్పటి వరకు చేసిన ట్రెక్కింగ్‌లో తలకోన నుంచి గుండాల కోన వరకు చేసిన యాత్ర నాకు ఎంతో ఇష్టం. అలాగే వెంకటగిరి దుర్గం, శేషాచలంలో కంగుమడుగు వంటి ప్రాంతాలు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. – ట్రెక్కింగ్ బాలు, తిరుపతి

వైవిధ్యమైన యాత్ర



అడవులు, ప్రత్యేక ప్రాంతాలలో ట్రెక్కింగ్ చేయడం ఓ వైవిధ్యమైన అనుభూతిని కలిగిస్తుంది. గత 35 ఏళ్లుగా ట్రెక్కింగ్ చేస్తున్నా. సాహస యాత్రలలో వందలాదిమందిని భాగస్వాములు చేశాం. సామూహిక ట్రెక్కింగ్‌లు చేపట్టాం. జన సమూహంతో చేసే ట్రెక్కింగ్ ఎంతటి కష్టతరమైన ఒకరికొకరి సహకారంతో సులభతరంగా మార్చుకుంటూ అనేక పర్యావరణ అద్భుతాలను ఆస్వాదించాం. శారీక, మానసిక ఆరోగ్యాన్ని కలిగించే అద్భుత యాత్ర ట్రెక్కింగ్. నేటి యువత జీవిన విధానంలో ట్రెక్కింగ్ కూడా భాగం కావాలి.

– బీవీ రమణ, ట్రెక్కింగ్ మాస్టర్

మధురానుభూతి



సరికొత్త ప్రదేశాలలో ట్రెక్కింగ్ చేస్తుంటే చెప్పలేనంద ఆనందమేసింది. ప్రకృతి అందాలు, పారే సెలయేరులు, పక్షులు చేసే శబ్దాలు ఒకటేమిటి ట్రెక్కింగ్ మదిలో నిండైనా మధురానుభూతిని నింపింది. ప్రకృతి ప్రేమికులతో కలిసి సుమారు 11 ఏళ్లుగా ట్రెక్కింగ్ చేస్తున్నా. అటవీ ప్రాంతాల్లో టెంట్‌లు వేసుకుని గడపడం సంతోషంగా ఉంటుంది. ప్రకృతి అందాలను పరిశీలిస్తూ పయనం సాగించడం వల్ల ఆనందం కలుగుతుంది.

-కె.సాయిబాబా. రిటైర్డ్ ఆర్డీఓ, తిరుపతి

క్రమశిక్షణ అలవడుతుంది



ట్రెక్కింగ్ సాహస యాత్ర చేపట్టడం ద్వారా పరిపూర్ణ ఆరోగ్యం, క్రమశిక్షణ అలవడుతుంది. పర్యావరణం పట్ల ఇష్టంతో గత 10 ఏళ్లుగా సామూహిక ట్రెక్కింగ్‌లో పాల్గొంటున్నా. జన జీవనానికి దూరంగా తాము చేసే ట్రెక్కింగ్ ప్రదేశాలలో మనసు ఎంతో ఉల్లాస భరితంగా ఉంటుంది. నలుగురితో కలిసి చేసే పయనం చేయూతనిచ్చే మనస్తత్వాన్ని అలవాటు చేస్తుంది. ట్రెక్కింగ్‌తో జీవన శైలి మంచిగా మార్పు చెందుతుంది.

– డాక్టర్ సుహార్లత, తిరుపతి

నిఘా నేత్రంపై నీలినీడలు?

శేషాచలం అటవీ ప్రాంతంలోని అరుదైన ఎర్రచందనం చెట్ల సంరక్షణకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కట్టుదిట్టంగా చర్యలు చేపట్టింది. అందులో భాగంగా డ్రోన్ సాంకేతికతను వినియోగించేందుకు సర్వే సైతం చేయించింది. దట్టమైన అడవిలో సైతం ఎర్రదొంగల ఆచూకీని కనిపెట్టేందుకు నిఘా వ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రణాళిక రూపొందించింది. ఈ మేరకు ఏపీ టెక్నాలజీ సర్వీసెస్‌కు శ్రీకారం చుట్టింది. అయితే కూటమి సర్కారు కొలువుదీరిన తర్వాత అటవీ పరిరక్షణ అటకెక్కింది. సంబంధిత శాఖ మంత్రి పవన్ కల్యాణ్ పట్టించుకోకపోవడంతో చెట్ల నరికివేతకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. స్మగ్లర్ల ఆటకట్టించేందుకు నిర్ణయించిన నిఘా నేత్రం నిర్వీర్యమైపోతోంది.

- శేషాచలంపై డ్రోన్లు ఎగిరేనా..?
- ఎర్రదొంగల కట్టడికి అడుగులు పడేనా..?
- అటవీ సంరక్షణపై పవన్ దృష్టి సారించేనా..?
- సిబ్బంది కొరత తీర్చేందుకు చర్యలు చేపట్టేనా..?

తిరుపతి మంగళం : శేషాచలం అడవుల్లోని ఎర్రచందనంతోపాటు, అరుదైన జీవజాతులను కాపాడుకుని భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత నేటి తరంపై ఉంది. అయితే స్మగ్లర్ల కారణంగా ఎర్రచందనం కనుమరుగై పోతోంది. వేటగాళ్ల కారణంగా వన్యప్రాణులు బలైపోతున్నాయి. చిత్తూరు, తిరుపతి, వైఎస్సార్ కడప జిల్లాల పరిధిలో సుమారు 4,75,599 లక్షల హెక్టార్లలో శేషాచలం అడవులు విస్తరించి ఉన్నాయి. ఇందులో బయోస్పియర్ రిజర్వుగా ప్రకటించిన కీలకమైన కోర్స్, బఫర్, ట్రాన్సిస్ట్ జోన్లు ఉన్నాయి. అంతేకాకుండా ట్రాన్సిస్ట్ జోన్లో భాగంగా 30124.5 హెక్టార్ల రిజర్వు ఫారెస్ట్ ఉంది. ఇంత పెద్ద అటవీ ప్రాంతాన్ని అరాకొరగా ఉన్న అటవీ సిబ్బంది, టాస్క్‌ఫోర్స్ బలగాలతో రక్షించడం అసాధ్యం. ప్రధానంగా స్మగర్లు తప్ప మరెవ్వరూ ప్రవేశించలేని దట్టమైన అటవీ ప్రదేశంలోని ఎర్రచందనాన్ని, వన్యప్రాణులను కాపాడడం మరింత కష్టం. బలగాలు ప్రవేశించలేని ప్రాంతాల్లో డ్రోన్ల సాయాన్ని తీసుకోవడం, ఆ సాంకేతితతో రక్షణ చర్యలు చేపట్టడం మాత్రమే అధికారుల ముందు ఉన్న మార్గంగా కనిపిస్తోంది. అయితే ఇందుకోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏపీటీసీ (ఏపీ టెక్నాలజీ సర్వీసెస్)తో ప్రాథమిక సర్వే చేయించింది. ఈ మేరకు డ్రోన్ నిఘాలోకి శేషాచలం అటవీప్రాంతాన్ని తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టింది. అయితే ఇంతలో ఎన్నికలు రావడం, అధికార మార్పిడి జరగడంతో డ్రోన్‌లతో నిఘా మరుగునపడిపోయింది.

కనిపించని పురోగతి

శేషాచలం అడవులపై నిరంతర నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసి, ఎర్రచందనం సంరక్షణ, స్మగర్లను కట్టడి చేస్తామని అటవీశాఖ చెప్పినా ఆదిశగా అడుగులు వేయడంలేదు. ఎర్రచందనం సంరక్షణకే ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ అధికారులు 2019లో చేసిన ప్రయోగాలకు కూడా అటవీశాఖ మద్దతు పలకలేదు.. స్వయంగా చేసిన ప్రయత్నాల్లోనూ ఎలాంటి పురోగతి కనిపించలేదు. ఈ క్రమంలోనే 2020 లో జిల్లా అటవీశాఖ, డ్రోన్లతో అటవీ రక్షణ చర్యలు చేపట్టడంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించింది. తిరుమల, తిరుపతిలో టవర్లు ఏర్పాటు, జీపీఎస్ సిస్టమ్ ద్వారా డ్రోన్‌లు వినియోగించవచ్చని గత ఏడాది ప్రయోగాత్మకంగా నిరూపించింది.



జిల్లా అటవీశాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు (ఫైల్)



శేషాచలం అడవుల్లో ప్రయోగాత్మకంగా డ్రోన్ ఎగురవేస్తున్న అటవీశాఖ, టాస్క్‌ఫోర్స్ అధికారులు (ఫైల్)

పట్టించుకోని పవన్

డిప్యూటీ సీఎంగా, రాష్ట్ర అటవీశాఖ మంత్రిగా పవన్‌కల్యాణ్ బాధ్యతలు చేపట్టి నెలలు గడుస్తున్నా అడవుల సంరక్షణపై ఇప్పటి వరకు దృష్టి సారించడంలేదని అటవీశాఖ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం అటవీశాఖ వైపు కన్నెత్తి చూడనేలేదంటున్నారు. సిబ్బంది కొరతతో అడవుల పరిరక్షణ కష్టతరంగా మారిందని వెల్లడిస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి సక్రమంగా వేతనాలు చెల్లించకపోవడంతో వారు జిల్లా అటవీశాఖ కార్యాలయం వద్ద వారు ఆందోళనకు సైతం దిగారని వివరిస్తున్నారు.

క్లుప్తంగా

ఘాట్ బాధితులకు స్విమ్స్‌లో వైద్య సేవలు

తిరుపతి తుడా: మొగిలి ఘాట్ రోడ్డు ప్రమాదంలో గాయపడిన ముగ్గురు క్షతగాత్రులకు తిరుపతి స్విమ్స్‌లో వైద్య సేవలు అందిస్తున్నారు. చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం శనివారం స్విమ్స్‌కు తరలించారు. ఉత్తర ప్రదేశ్‌లోని బైసర్ మండలం మహారాజ్ గని ప్రాంతానికి చెందిన ఆషితోష్ కుటుంబ సభ్యులు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆరేళ్ల చిన్నారి అక్కడికక్కడ మృతి చెందగా ఆయన భార్య వెంకి సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో, కుమారుడు అస్మిత్ యాదవ్ న్యూరో సర్జరీ విభాగంలో చికిత్స అందిస్తున్నారు. అషితోష్‌కు జనరల్ సర్జరీలో శస్త్ర చికిత్సను పూర్తి చేశారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్


పోలీస్‌స్టేషన్ వద్ద ట్రాక్టర్

ఏర్పేడు : మండలంలోని పాపానాయుడుపేట సమీపంలో సువర్ణముఖి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శనివారం సీజ్ చేసినట్లు సీఐ జయచంద్ర తెలిపారు. ఈ మేరకు ట్రాక్టర్లను ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు వెల్లడించారు.

టిప్పర్‌ను ఢీకొని యువకుడి మృతి

చిల్లకూరు : మండలంలోని జాతీయ రహదారిపై కోట క్రాస్ సమీపంలో శనివారం రాత్రి ముందు వెళుతున్న టిప్పర్‌ను ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. మండలంలోని నెలబల్లిరెట్టపల్లెకు చెందిన చీపినేటి మస్తాన్(25) స్కూటీపై తిరుమల డెయిరీ వైపు వెళుతున్నాడు. ఈ క్రమంలో నాయుడుపేట వైపుగా వెళుతున్న టిప్పర్‌ను ఓవర్‌టేక్ చేస్తుండగా ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న ఎస్ఐ సురేష్‌బాబు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం కారణంగా స్తంభించిన ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. అనంతరం మృతుడి కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఇంటర్ విద్యార్థినిపై లైంగికదాడి

– నిందితుడిపై పోక్సో కేసు నమోదు

వరదయ్యపాళెం: ఇంటర్ విద్యార్థినిపై లైంగికదాడి జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ మేరకు శనివారం నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీరాంజనేయులు తెలిపారు. వివరాలు.. కేవీబీపురం మండలం కాళంగి గ్రామానికి చెందిన 16 ఏళ్ల యువతి సత్యవేడు ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ఇంటర్ చదువుతోంది. రెండు రోజుల క్రితం స్వగ్రామానికి వెళుతుండగా మార్గం మధ్యలో అదే గ్రామానికి చెందిన ఎస్.వెంకయ్య (24) అనే యువకుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ వెల్లడించారు. నిందితుడిని త్వరలోనే అరెస్ట్ చేయనున్నట్లు వివరించారు.

వైద్య విద్య అందుబాటులో ఉండాలి



వైద్య విద్యను అభ్యసించడం పేదలకు కష్టతరంగా మారుతోంది. సామాన్యులకు సైతం మెడిసిన్ చదవడం అందుబాటులోకి తీసుకురావాలి. మా కుమార్తె హైదరాబాద్‌లోని ఓ కోచింగ్ సెంటర్‌లో లాంగ్‌టర్మ్ నీట్ కోచింగ్ తీసుకుంటోంది. మొదటి విడతగా ఇదివరకు నీట్ రాసినా సీటు రాలేదు. అందుకే నీట్‌లో ర్యాంకు సాధించడమే లక్ష్యంగా కోచింగ్ తీసుకుంటోంది. పేదలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీట్ల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే మంజూరైన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను అడ్డుకోవడం సరికాదు. రాజకీయాల కోసం విద్యార్థుల భవిష్యత్‌ను నాశనం చేయాలని చూడకూడదు. రాష్ట్రానికి కేటాయించిన మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయాలనుకోవడం భావ్యం కాదు. తమ పిల్లలను వైద్యులుగా చూడాలని తల్లిదండ్రులు కలలు కంటున్నారు. ఎంతో వ్యవప్రయాసలకోర్చి చదివిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలి.

– మోహన్ , విద్యార్థి తండ్రి, పులికుంద్రం, పిచ్చాటూరు మండలం



ఆశలన్నీ వైద్య విద్యపైనే..!



సగం మంది విద్యార్థులు డాక్టర్ విద్యను అభ్యసించాలని కలలు కంటున్నారు. అందులో నేను కూడా వైద్య విద్యను చదువుకోవాలని ఇంటర్‌లో బైపీసీ తీసుకున్నా. చక్కగా చదివి మంచి మార్కులు సాధించా. అయితే పలు కారణాలతో డిగ్రీలో చేరా. మా స్నేహితులు ఇప్పటికీ లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకుంటున్నారు. అయితే ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలనుకోవడంతో వారందరూ అయోమయంలో పడిపోయారు. వైద్య వైద్యను నిరుపేదలకు సైతం అందుబాటులోకి తీసుకువచ్చే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. సీట్ల సంఖ్య మరింత పెంచేందుకు కృషి చేయాలి. అంతే కానీ, ఉన్నవాటిని పోగొట్టకూడదు.

– వి.కీర్తి, విద్యార్థిని, పిచ్చాటూరు

తిరుమలలో ‘కూటమి’ తట్టలు!

- పట్టించుకోని టీటీడీ అధికారులు


అనధికారికంగా ఏర్పాటైన తట్టలు

తిరుమల : శ్రీవారి సన్నిధిలో నయా దందాకు కూటమి నేతలు శ్రీకారం చుట్టారు. కొండపై అనధికారికంగా వ్యాపారాలు ప్రారంభించారు. అధిక రద్దీ ఉండే ప్రాంతాల్లో గుట్టు చప్పుడు కాకుండా దుకాణాలు పెట్టేశారు. అలిపిరి నుంచి తిరుమలలోని అఖిలాండం వరకు అనేక చోట్ల అనధికార హాకర్ల అవతారం ఎత్తేశారు. సాధరణంగా తిరుమలలో వ్యాపారం చేయాలంటే టీటీడీ నుంచి తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలి. ఈ మేరకు ప్రతినెలా టీటీడీకి ఫీజు చెల్లించాలి. అయితే కొందరు కూటమి నేతలు తిరుమలలో దందాలకు దిగేశారు. పుట్టగొడుగుల్లా అనధికార హాకర్‌లను పుట్టించేశారు. ఈ క్రమంలో శ్రీవారి ఆలయానికి అభిముఖంగా ఉన్న అఖిలాండం వద్ద నాలుగు, డీబీఆర్ రోడ్డులో షెడ్డుకు అనుకుని మరి కొన్ని దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇక వరాహస్వామి అతిథిగృహం వద్ద మరికొందరు అనధికార హాకర్లు తట్టలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఇక అలిపిరి నుంచి గాలి గోపురం మధ్యలో జనసేన, టీడీపీ నేతలు రెండు దుకాణాలను అనధికారంగా పెట్టినట్లు సమాచారం. కూటమి నేతల పేర్లు చెప్పుకుని ఆయా దుకాణాలను ఏర్పాటు చేయడం గమనార్హం. దీనిపై స్థానిక వ్యాపారులు తీవ్రంగా ఆవేదన చెందుతున్నారు. తమ దుకాణాలకు అద్దె చెల్లిస్తుంటే, కూటమి నేతలు మాత్రం అధిక రద్దీ ఉండే ప్రాంతాల్లో షాపులు పెట్టుకుని పైసా కూడా టీటీడీకి కట్టడం లేదని ఆరోపిస్తున్నారు. కొండపై సుమారు 13 దుకాణాలకు పైగా కూటమి నేతల కనుసన్నల్లో వెలిసినట్లు వెల్లడిస్తున్నారు. ఇప్పటికైనా టీటీడీ అధికారులు స్పందించి అనధికార తట్టలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్పా ముసుగులో వ్యభిచారం

ముగ్గురు విటుల అరెస్టు


పోలీసుల అదుపులో ఉన్న విటులు

తిరుపతి క్రైమ్: తిరుపతి నగరంలోని పలు స్పా సెంటర్లపై పోలీసులు మెరుపు దాడులు చేశారు. ముగ్గురు విటులను అరెస్టు చేశారు. ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ వెంకటనారాయణ ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. స్పా సెంటర్ల ముసుగులో వ్యభిచార గృహాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ ఆధ్వర్యంలో శనివారం రాత్రి పోలీసులు వేర్వేరు ప్రాంతాల్లోని మూడు స్పా సెంటర్లపై దాడులు నిర్వహించారు. ఆ క్రమంలో ఈస్ట్ సీఐ మహేశ్వర రెడ్డి, ఎస్ నాగేంద్రబాబు, సిబ్బంది కలసి కొర్లగుంటలోని డీబీఆర్ హాస్పిటల్ రోడ్లో ఉన్న సీ–7 సెలూన్ అండ్ స్పా సెంటర్‌పై దాడి చేశారు. ఆ సెంటర్‌లో నలుగురు మహిళలు, ముగ్గురు విటులను పక్క పక్క గదుల్లో వ్యభిచారం చేస్తూ పట్టుబడ్డారు. ముగ్గురు విటులను అరెస్టు చేశారు. ఆ స్పా సెంటర్ మేనేజర్‌గా మనీషా, ఆర్గనైజర్లుగా మహి, ఆమె భర్త అఫ్తాబ్ వ్యవహరిస్తున్నట్లు గుర్తించారు. మహిళల అక్రమ రవాణా, వ్యభిచార గృహాల నిర్వాహకులపై కఠినంగా వ్యవహరిస్తామని డీఎస్పీ వెంకటనారాయణ తెలిపారు. ఆధ్యాత్మిక నగరంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సదస్సుకు 100 మంది కంటి వైద్యులు

తిరుపతి తుడా : రాష్ట్రస్థాయి సదస్సుకు రెండో రోజు శనివారం 100 మందికి పైగా కంటి వైద్యులు హాజరుకావడం ఆనందంగా ఉందని ఐ డాక్టర్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ చైర్మన్ సురేంద్రశెట్టి తెలిపారు. తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో చేపట్టిన మూడు రోజుల సదస్సులో ఆయన మాట్లాడారు. ఆధునిక విధానాలను అందిపుచ్చుకోవడమే లక్ష్యంగా సదస్సు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

1,562 కేసుల పరిష్కారం

తిరుపతి లీగల్ : తిరుపతి కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో 1,562 కేసులు పరిష్కరించామని, 22 కోట్ల 84 లక్షల 66,580 రూపాయలను పరిహారం కింద బాధితులకు అందించామని తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి ఎం. గురునాథ్ తెలిపారు. లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు అర్చన, రామచంద్రుడు, విజయరామరాజు, సునీత రాణి, శైలజ, సత్య కుమార్, కోటేశ్వరరావు, గ్రంధి శ్రీనివాస్, సంధ్యారాణి, సరిత పాల్గొన్నారు.

రేపటి నుంచి పవిత్రోత్సవాలు

తిరుపతి రూరల్: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఆదివారం సాయంత్రం విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఆలయంలో తెలిసీ తెలియక జరిగిన దోషాల పరిహారార్థం పవిత్రోత్సవాలు జరిపించడం ఆనవాయితీ. అందులో భాగంగా 16న పవిత్రప్రతిష్ఠ, 17న పవిత్ర సమర్పణ, 18న పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గృహస్తులు రూ.750 చెల్లించి పవిత్రోత్సవాల ఆర్జిత సేవలో పాల్గొనవచ్చు. ఆదివారం అంకురార్పణ సందర్భంగా కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, 16న అష్టదళ పాద పద్మారాధన సేవలను రద్దు చేశారు. అలాగే 16, 17, 18వ తేదీల్లో కల్యాణోత్సవం, బ్రేక్ దర్శనం, వేద ఆశీర్వచనం, కుంకుమార్చన, ఊంజల్‌సేవను టీటీడీ రద్దు చేసింది.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

చిల్లకూరు : మండలంలోని రైటార్ సత్రం గిరిజన కాలనీలో ఓ బాలిక(16) అదృశ్యంపై తల్లిదండ్రులు శనివారం ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం బయటకు వెళ్లిన తిరిగి ఇంటికి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ప్రకృతి సేద్యం.. మనమే ఆదర్శం

- నేడు జిల్లాకు వస్తున్న మెక్సికో ప్రతినిధులు
- మూడు రోజులపాటు క్షేత్రస్థాయిలో పర్యటన
- 25న తరలిరానున్న ఆఫ్రికా బృందం

తిరుపతి అర్బన్ : వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. చిత్తశుద్ధితో పనిచేసి సాగును సంబరంగా మార్చింది. రాయితీపై విత్తనాల సరఫరా చేయడంతోపాటు ధాన్యం కొనుగోలు వరకు సహకారం అందించింది. ఈ క్రమంలోనే ప్రకృతి వ్యవసాయానికి సైతం పెద్ద పీట వేసింది. సేంద్రియ సాగుకు క్షేత్రస్థాయిలో ప్రోత్సాహం అందించింది. దీంతో జిల్లాలో ప్రకృతి వ్యవసాయం సరికొత్త పుంతలు తొక్కింది. దేశవిదేశాల దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ మేరకు ఆదివారం తిరుపతికి మెక్సికో ప్రభుత్వ ప్రతినిధుల బృందం రానుంది. అలాగే ఈ నెల 25వ తేదీన ఆఫ్రికా బృందం సైతం జిల్లాలో పర్యటించనుంది.

15 మంది సభ్యులతో బృందం రాక

మెక్సికో ప్రభుత్వ బృందం ఆదివారం తిరుపతి జిల్లాకు రానుంది. 15 మంది సభ్యులతో కూడిన ఆ బృందంలో నలుగురు శాస్త్రవేత్తలు, ఐదుగురు సాంకేతిక నిపుణులు, నలుగురు రైతులు, ఇద్దరు సిబ్బంది ఉంటారు. రాష్ట్ర రైతు సాధికార సంస్థ ద్వారా జిల్లాలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించనున్నారు. ప్రధానంగా సేంద్రియ ఎరువులను ఏ విధంగా వాడుతున్నారో బృందం తెలుసుకోనుంది. వేప, కానుగ, నేరేడు, తదితర ఆకుల ద్వారా తయారు చేసిన కషాయాలను పంటలకు పిచికారీ చేయడం ద్వారా తెగుళ్ల సులభంగా ఎలా నివారిస్తున్నారనే అంశాలను అధ్యయనం చేయనుంది.

25న ఆఫ్రికా ప్రతినిధులు రాక

ఈనెల 25వ తేదీన ఆఫ్రికాకు చెందిన బృందం తిరుపతికి రానుంది. ప్రధానంగా ఇక్కడి ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో భూములకు వాడుతున్న ఘన జీవామృతం, ద్రవ జీవామృతంపై పరీక్షలు నిర్వహించనుంది. విత్తన శుద్ధి కోసం వినియోగిస్తున్న కషాయాల తయారీని పరిశీలించనుంది.

మూడు రోజు పర్యటన ఇలా...

మెక్సికోలో అమలు చేస్తున్న ‘ప్రొడక్షన్ ఫర్ వెల్ బీయింగ్’ కార్యక్రమంలో భాగంగా ఈ బృందం విచ్చేస్తోంది. ముందుగా తిరుపతి రూరల్ మండలం వేమురులో ప్రకృతి వ్యవసాయం సాగు, పెట్టుబడులు, దిగుబడి, లాభ నష్టాలను అంచనాలు వేయనుంది. ప్రకృతి సేద్యంలో పొదుపు సంఘాల పాత్రను ఆరా తీయనుంది. 16వ తేదీన చిన్నగొట్టిగల్లు మండలంలోని పలు ప్రాంతాల్లో ఏ–గ్రేడ్ ప్రకృతి మోడల్ క్షేత్రాలను పరిశీలించనుంది. 17వ తేదీన రామచంద్రాపురం మండలంలోని కుప్పం బాదూరు, జీకే పల్లె, గొల్లపల్లె గ్రామాల్లో పర్యటించి ఏ–గ్రేడ్ ప్రకృతి సేద్యం, విత్తన శుద్ధితో కలిగే ప్రయోజనాలను ఆ బృందం తెలుసుకోనుంది.

పకడ్బందీ ఏర్పాట్లు

మెక్సికో ప్రభుత్వ బృందం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఏ.షణ్ముగం తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయకుమార్ ముందుగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

వైద్యులకు సేవానిరతి తప్పనిసరి

- కలెక్టర్ వెంకటేశ్వర్
- ఘనంగా ఎస్వీ మెడికల్ కళాశాల దినోత్సవం


కలెక్టర్‌ను సత్కరిస్తున్న వైద్య విద్యార్థులు

తిరుపతి తుడా: వైద్య వృత్తి పవిత్రమైందని, అందులో ఉన్న వారు సేవానిరతిని కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఎస్వీ మెడికల్ కళాశాల దినోత్సవాన్ని శనివారం స్థానిక భువన విజయం ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రతి వైద్యుడూ కృషి చేయాలన్నారు. ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్న తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో రెండేళ్లపాటు పనిచేయడాన్ని అలవాటుగా చేసుకోవాలన్నారు. ఆ తర్వాత పీజీ వైద్య విద్య నేర్చుకుంటే మరింత ప్రాక్టికల్‌గా ఉంటుందని వివరించారు. ఇక్కడి విద్యార్థులను చూస్తుంటే తాను ఎంబీబీఎస్ చదువుకున్న రోజులు గుర్తుకొస్తున్నాయన్నారు. అనంతరం కలెక్టర్‌ను ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్, రుయా, మెటర్నటీ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు డాక్టర్ రవిప్రభు, డాక్టర్ పార్థసారథిరెడ్డి, వైద్యాధికారులు సునీత, వెంకటేశ్వర్లు, మాధవీలత పాల్గొన్నారు.